కమలానగర్ సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆయన కమలానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీ సమీపంలో ఉన్న వనస్థలిపురం రైతుబజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతూ కాలనీలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కాలనీలోని సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుబజారు వద్ద వ్యాపారాలు చేసుకునేవారు, కాలనీవాసులను సమావేశ పరిచి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజ్‌కిరణ్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వరిరెడ్డి, మల్లేష్, శ్రావణ్‌కుమార్, సత్తిరెడ్డి, సుబ్బారావు, టీవీ రావు, భారత్‌సింగ్, జ్యోతిరెడ్డి, సత్యనారాయణ, గణేష్, అచ్యుత్, రామారావు, నాగమల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు.

6 నుంచి ఓటర్ల నమోదు

- జనవరి 1వ తేదీ లోపు 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- మార్పుల సవరణకు అవకాశం
- మలక్‌పేట సర్కిల్–6 ఎన్నికల అధికారి జయంత్ →





చాదర్‌ఘాట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జనవరి 6వ తేదీ నుంచి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను చేపట్టనున్నట్లు మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్, ఎన్నికల అధికారి జయంత్ తెలిపారు. మంగళవారం ఆయన సర్కిల్–6 కార్యాలయంలో మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, చిరునామాల మార్పు తదితర అంశాలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 2024 జనవరి 1వ తేదీ లోపు 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. జనవరి 6న ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రచురించి అదేరోజు నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. వాటిని ఫిబ్రవరి 2వ తేదీ వరకు పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 6 లోగా డేటాబేస్‌లో అప్‌డేట్ చేసిన తరువాత 8న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. జనవరి 5 వరకు పోలింగ్ స్టేషన్ల వారీగా ఏర్పాట్లు, ఓటర్ల జాబితా గుర్తింపు కార్డులోని లోపాల సవరణ, పోలింగ్ కేంద్రాల సరిహద్దుల సవరణ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ఇదీ

- సవరణలు, అభ్యంతరాలుకు గడువు జనవరి 6 నుంచి 22 వరకు
- దరఖాస్తుల పరిష్కారం ఫిబ్రవరి 2 వరకు
- డేటాబేస్ అప్‌డేట్ ఫిబ్రవరి 6
- ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఫిబ్రవరి 8

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



శిబిరంలో వైద్య పరీక్ష చేయించుకుంటున్న డీసీపీ సాయిశ్రీ

వనస్థలిపురం: ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో కామినేని, తేజస్విని ఆసుపత్రుల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గద్దె విజయ్‌నేత, డా.మీర్యాంబాబు, డా.ఆర్.రామ్మూర్తి, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు శంకర్, శివ, ఉపేందర్‌రెడ్డి, శ్రీను, మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాకెట్ల పంపిణీ



అక్బర్‌బాగ్‌లో.. గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల



జీసెస్ క్రైస్ట్ బిలివర్స్ చర్చిలో పంపిణీ చేస్తున్న అధ్యక్షుడు అబ్రాహం మాణిక్యం

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌లో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్లో మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ గిఫ్ట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, సల్మాన్‌రాజ్, సమి, తదితరులు పాల్గొన్నారు. మలకోపేట జీసెస్ క్రైస్ట్ బిలివర్స్ చర్చిలో మలక్‌పేట పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్రాహం మాణిక్యం క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లు అందజేశారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 21, వంకాయ 55, బెండ 55, పచ్చి మిర్చి50, కాకర 71, బీర 55, క్యాలీఫ్లవర్ 27, క్యాబేజీ 18, కారెట్ 40, దొండ 65, ఆలు 24, ఉల్లి 24, గోకర 60, దోస 35, సొర 19, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 75, అర్వి 45, మునగ 95, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 65. బుధవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

వైభవంగా లక్ష్మీసహస్ర నామ కుంకుమార్చన



శ్రీసూక్త హవనంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలోని గోదా రంగనాథస్వామి ఆలయంలో ధుర్మాస ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు మహిళలచే సామూహిక లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన, శ్రీసూక్త హవనం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, హనుమంతరావు, యాదగిరి, మురళి, రాంమూర్తి, కృష్ణమూర్తి, రమేష్, కేశవులు, అర్చకులు బాల మురళీశర్మ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

బోడుప్పల్: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జన్మదినం పురస్కరించుకుని బోడుప్పల్ 14వ డివిజన్‌లో పేదలకు మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ బోడుప్పల్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బేజాడి బ్రహ్మం, డివిజన్ నాయకులు కళ్లం నవీన్‌రెడ్డి, జమ్ము సురేష్, మురళీకృష్ణ, చంద్రశేఖర్, పురుషోత్తం, సాయి మనోహర్, సత్యనారాయణ, దుస్సా నరేష్ తదితరులు పాల్గొన్నారు

పద్మశాలి సంఘం కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నాగోలు: పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్, శ్రీరామకృష్ణ డివిజన్ పద్మశాలి సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన జరిగిన సమావేశంలో భావనా రుషి సహకార గృహ నిర్మాణ సంఘం బాధ్యులు సీత ఆంజనేయులు, చండూర్ జెడ్‌పీటీసీ కర్నాటి వెంకటేశం ముఖ్యఅతిథులుగా పాల్గొని కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీత ఆంజనేయులు మాట్లాడుతూ, నేతన్నల సంక్షేమానికి అమలు పరుస్తున్న పథకాలన్నీ వారికి చేరేటట్లు చూడాల్సిన బాధ్యత సంఘం నాయకులపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో సంఘం సర్కిల్ గౌరవ అధ్యక్షుడు రాము నేత, రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత, ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణ, శ్రీరామ కృష్ణాపురం సంఘం అధ్యక్షుడు తలాటి రమేష్, గౌరవ అధ్యక్షుడు, మేళా చైర్మన్ కొంకుంట్ల రవితేజ, ప్రధాన కార్యదర్శి జెల్లా జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీ సన్నాహక సభ

హాజరు కానున్న కేంద్ర మంత్రి అమిత్‌షా



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కొంగరకలాన్‌లోని శ్లోక కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 28 నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభకు ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరవుతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాలాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో స్వల్ప తేడాతో బీజేపీ ఓటమి చెందినప్పటికి నైతిక విజయం సాధించిందని అన్నారు. ఈసారి లక్ష ఓట్లు పడటం చాలా సంతోషమన్నారు. రాబోయే ఎన్నికల్లో మరింత దూసుకు పోతామన్నారు. 1983 కంటే ముందే ఈ ప్రాంతంలో బీజేపీకి బీజాలు పడ్డాయని అన్నారు. బలమైన శక్తిగా బీజేపీ అవతరిస్తున్నదని అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అమిత్‌షాతో పాటు బీజేపీ జాతీయ నాయకులు సంతోష్, డా.లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్ పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

కనుల పండువగా అయ్యప్పస్వామి పడిపూజ

నాగోలు: సంఘ సేవకుడు మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేటలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్ని భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా , నరేష్ గుప్తా, రమణ, జిన్నం వేణు బాలరాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జైపురికాలనీలో...

నాగోలు డివిజన్ పరిధిలోని యెగ్గె మల్లేశం గార్డెన్‌లో పల్లె మహేష్ గౌడ్ యెగ్గె భిక్షపతి గురుస్వాముల ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా, సిద్దాల ఐలయ్య, డప్పు నర్సింహరాజు, మహేందర్ పాల్గొన్నారు.

రాముని పాదుకలు దర్శించుకోండి



రాముని పాదుకలను దర్శించుకున్న కార్పొరేటర్

సైదాబాద్: పవిత్ర అయోధ్య శ్రీరాముని పాదుకలను సైదాబాద్ డివిజన్‌వాసులు అందరూ దర్శించుకోవాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం అయోధ్య నుంచి సైదాబాద్‌కు తరలివచ్చిన శ్రీరామ పాదుకలు, పవిత్ర నదీజలాలను జీఏ–1 కాలనీలోని శ్రీకాశీ విశ్వేశ్వర సహిత వైష్ణవి భువనేశ్వరి ఆలయంలోకి చేర్చారు. భక్తుల దర్శనార్థం వాటిని అందుబాటులో ఉంచారు. మంగళవారం డివిజన కార్పొరేటర్ పలువురు మహిళలతో కలిసి పాదుకలు, నదీజలాలను దర్శించుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, ఇంత చక్కటి అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

రేపటి నుంచి ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు

- కమిషనర్ అల్లూరి వాణి

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో వార్డు సభలు ఏర్పాటు చేస్తామని కమిషనర్ అల్లూరి వాణి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆమె చెప్పారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను తీసుకుంటామని అన్నారు. ఈ నెల 31, జనవరి 1 తేదీన సెలవు దినాలు ఉంటాయని కమిషనర్ సూచించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

కాచిగూడ: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని స్వామి శ్రద్ధానంద్ మనుమరాలు మంజుశ్రీ, డాక్టర్ విజయవీర్ విద్యాలంకర్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ గంగారామ్ మెమోరియల్ ఫోరం ఆధ్వర్యంలో స్వామి శ్రద్ధానంద్ 200వ జయంతి వేడుకను ఆర్య కన్యా విద్యాలయ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి శ్రద్ధానంద్ తన సంకల్పంలో దృఢంగా ఉండి మహర్షి దయానంద్‌ని కలుసుకోవడం ద్వారా సత్యం పట్ల ఆయనకున్న భక్తితో పాటు అతని జీవితం మారిపోయిందని చెప్పారు. తండ్రి ఆదేశానుసారం మహర్షి దయానంద్ ఉపన్యాసాలు వినడానికి స్వామి శ్రద్ధానంద్ వెళ్లేవాడని, దీంతో అతను మున్షీరామ్ నుంచి స్వామి శ్రద్ధానంద్‌గా మారాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తరామ్, మహేష్ అగర్వాల్, ప్రేమ్ చంద్ మునోత్, సోమనాథ్, దినేష్ సింగ్, రోజా, మనోహర్ సింగ్, రామలత, సవిత, పూజ, భగత్ సింగ్, భగీరథ్ శారద పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నోజు శ్రీనివాసులు

హస్తినాపురం: నిబంధనలను విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ రహదారిపై ఏర్పాటు చేసిన మద్యం దుకాణం నిర్వాహకుడు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని, ఈ దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హస్తినాపురంలో విలేకరులతో మాట్లాడుతూ, సరూర్‌నగర్ డీపీఈఓ అండదండలతో ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా బార్లను తలదన్నే విధంగా హస్తినాపురం చౌరస్తా దగ్గర సాగర్ రహదారిపై వైన్‌షాపు ఏర్పాటు చేశారని, వెంటనే దానిని తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని శ్రీనివాసులు హెచ్చరించారు. సమావేశంలో ఆర్.లింగస్వామి. అన్నపోసల వెంకటేష్, పోలే విష్ణు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మహాసభ మహిళా కమిటీ కన్వీనర్‌గా సుజాత



సుజాతను అభినందిస్తున్న పిల్లి శ్రీనివాస్ రావు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ మహిళా కమిటీ కన్వీనర్‌గా చామకూర సుజాత, ఇన్‌చార్జిగా అడ్వొకేట్ అన్నపూర్ణను నియమిస్తూ మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా కాచిగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సుజాత, అన్నపూర్ణతో పాటు సభ్యులుగా నియామకమైన భాగవతి, జ్యతి, లక్ష్మి, దుర్గా, సరిత, శైలజ, అరవింద, అనుషా, మంజుల, జ్యోతిలక్ష్మిలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. త్వరలోనే కాచిగూడలోని మున్నూరు కాపు భవన్ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల నగేష్, దండు నరేందర్, బాధే పద్మరావు, చెల్మేల మహేష్ బాబు, దయానంద్, పద్మనాభం, చేపూరి వెంకటేశ్వర్లు, నర్సింగ్‌రావు, దండు ఆనంద్, గంధం విశాల్, రాకేష్ పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చౌకి రవికుమార్



దిల్‌సుఖ్‌నగర్ సాయి ఆలయంలో ధన్వంతరి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

చాదర్‌ఘాట్: దత్తాత్రేయ జయంతి వేడుకలను ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా మంగళవారం మున్సిపల్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయిబాబా మందిరం చైర్మన్ రాంకోటేశ్వరరావు, మధన్, రామకృష్ణ, రఘు, రాజేష్ పటేల్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో...

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో మంగళవారం దత్తాత్రేయ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం బాబాకు 108 కలశాలతో కృష్ణ, తుంగభద్రా పవిత్ర నదీ జలాలు, ఆవుపాలతో మంగళస్నానం, 108 బంగారు పుష్పాలచే సువర్ణ పుష్ప అలంకరణ మహోత్సవం, శ్రీసాయి సత్యవ్రతం నిర్వహించారు. ఓం సాయి.. శ్రీసాయి.. జయజయ సాయి నామ ఏకాహంలో భక్తులు అధిక సంఖ్యల పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన శ్రీచండీ సహిత ఆయుష్య ధన్వంతరి హోమంలో ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య దంపతులు పాల్గొన్నారు.

మహావిష్ణువు అవతార మూర్తి దత్తాత్రేయుడు

దిల్‌సుఖ్‌నగర్: మహావిష్ణువు అంశతో జన్మించిన అవతారమూర్తి దత్తాత్రేయుడు అని శృంగేరి శంకర మఠం బ్రాంచ్ హెడ్ ద్రావిడి శ్రీనివాస్ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి శృంగేరి శంకర మఠం ఆధ్వర్యంలో వారం రోజులు నిర్వహిస్తున్న దత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దత్తాత్రేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ నదీ జలాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, మూల మంత్ర హోమం, మహా పూర్ణాహుతి, పంచామృత అభిషేకం వంటివి చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విశ్వనాథ శోభనాద్రి, ఎడవల్లి సూర్యనారాయణ, గౌరి భాస్కర్, సూరి వ్యాసకుమార్, సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



అల్కాపురి శృంగేరి శంకర మఠంలో మహా పూర్ణాహుతి

పేదలకు అండగా సీపీఐ: ఆందోజు



సింగరేణి కాలనీలో సీపీఐ జెండాను ఎగురవేసిన షేక్ మహమూద్

హయత్‌నగర్: ఏళ్ల తరబడి పేదల పక్షాన ఉండి, వారికి అండగా నిలిచింది సీపీఐ ఒక్కటే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హయత్‌నగర్‌లో మండల పార్టీ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతాంగ సాయుధ పోరాటం నుంచి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పార్టీ సీపీఐ అని, పోరాటాల ద్వారా పేదలకు అనేక హక్కులను కల్పించిందన్నారు. భూ పోరాటం ద్వారా అనేక ఎకరాల భూమిని పేదలకు పంచామని, పేదలకు ఇళ్ల స్థలాలను సాధించామని అన్నారు. తెలంగాణ సాధనలో సీపీఐ కీలక పాత్ర వహించిందని, తెలంగాణ ప్రజలకు నీళ్లు, నిధులు, నియామకాలు సాధించే వరకు పోరాడతామని అన్నారు. పేదల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తోందని, వారిని అడ్డుకునేందుకు ప్రజా పోరాటాన్ని నిర్మిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణాచారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, నాయకులు సక్రూనాయక్, శ్రీదేవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాగోలులో..

నాగోలు: నాగోలు చౌరస్తాలో సీనియర్ నాయకుడు బోడ్డుపల్లి కృష్ణ అధ్యక్షతన సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, ఉప్పల్ మండల కార్యదర్శి రామ్ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. నాయకులు సామిడి శేఖర్‌రెడ్డి, కందుల సుధాకర్, ప్రవీణ్ కుమార్, బాతరాజు నర్సింహ, రాములు గౌడ్, సంజన, మల్లేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల వద్ద:

సీపీఐ నాగోలు డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని డబుల్ రూమ్ ఇళ్ల దగ్గర సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి పాల్గొని కేక్ కట్ చేసి జెండాను ఆవిష్కరించారు. నాయకులు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, యాదయ్య, లాల్ పటేల్, శ్రీదేవి, లక్ష్మీరాధా, దుండిగలక్ష్మి, శోభ పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలు సాధించే వరకు పోరాడుతాం..

సైదాబాద్: బడుగు బలహీన వర్గాల వారికి ఎల్లప్పుడూ అండగా నిలిచేది ఎర్రజెండానే అని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. మంగళవారం సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఐఎస్‌సదన డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ సహా పలు మురికివాడల్లోని గుడిసెవాసులకు పట్టాలు సాధించే వరకు సీపీఐ తరఫున పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ నాయకులు శంకర్‌నాయక్, అంజయ్య, దశరథ్ నాయక్, సక్రీబాయి, రేష్మ, రాజునాయక్, వెంకటేష్, సల్మాన్ పాల్గొన్నారు.



హయత్‌నగర్: సీపీఐ జెండాను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య కళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ 18వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. నృత్య గురువు శ్రావ్య మానస బోగిరెడ్డి శిష్య బృందం 300 మంది కళాకారులచే సుమధురోత్సవం పేరిట నిర్వహించిన నృత్య సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఆనంద తాండవం, మండోదరి శబదం, శివార్చకం, థిల్లాన వంటి అంశాలతో పాటు వివిధ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నాట్య గురువులు బాగవతుల సేతురామ్, కళాకృష్ణ, సినీ నటులు హేమ, రూపలక్ష్మీ, శ్రీనివాస్ బోగిరెడ్డి, సంగీత గురువులు ప్రతాప్, మురళి, శరత్ బోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తాం

రామంతాపూర్: బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతాపూర్–ఇందిరా ఎంపీ రియల్‌లోని సిమ్‌లైన్ ఫిట్‌నెస్ జిమ్ అధినేత కె.జయసింహాగౌడ్ సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడానికి ఈ నెల 27న వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఆయనను అభినందించే కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయసింహా ఓ వైపు ఆధునిక పరికరాలతో జిమ్ నిర్వహిస్తూ.. మరోవైపు ఎత్తయిన పర్వతాలను అధిరోహించే ట్రెక్కింగ్‌లో కూడా ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. గతంలో జయసింహ టాంజానియాలోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించి రికార్డు స్థాపించడం, అదేవిధంగా దక్షిణాఫ్రికాలో 19,341 అడుగుల ఎత్తయిన కిలిమంజరో పర్వతాన్ని అధిరోహించడానికి వెళ్లడం ప్రశంసనీయమని కొనియాడారు. తమ ట్రస్ట్ తరఫున జయసింహకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు పాలకూరి శ్రీకాంత్‌గౌడ్, గడ్డం రవికుమార్, డాక్టర్ బి.వి.చారి, సోమిరెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.